## గ్రూప్స్ శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగింపు

కమాన్‌చౌరస్తా, జనవరి 20: కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణ దరఖాస్తు గడువును ఈ నెల 24 వరకు పొడిగించారు. ఈ మేరకు స్టడీ సర్కిళ్ల డైరెక్టర్లు డాక్టర్ రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు వెబ్ సైట్ bcstudycircle. cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిగ్రీ అర్హత కలిగిన ఉమ్మడి కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాల కోసం 0878 – 2268686లో, కరీంనగర్‌లోని బీసీ స్టడీ సర్కిల్ నూతన భవనంలో సంప్రదించాలని సూచించారు.

## గోదావరిలో చిక్కిన పెద్ద చేప



ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 20: గోదావరిఖనిలోని గోదావరి నదిలో శనివారం చేపల వేటకు వెళ్లిన యువకులకు 15కిలోల బొత్స చేప చిక్కింది. ప్రస్తుతం గోదావరిలో నీటిశాతం తగ్గడంతో హనుమాన్‌నగర్‌కు చెందిన కొందరు యువకులు అర్ధరాత్రి గోదావరి బ్రిడ్జి వద్ద నదిలో గాలం వేశారు. పెద్ద చేప చిక్కడంతో ఆనందపడ్డారు.

## మంథని టూ చంద్రాపూర్ బస్సులు బంద్

మహిళలకు ఫ్రీ బస్ జర్నీ ఎఫెక్ట్

- భద్రాచలం సర్వీసులు కూడా నిలిపివేత
- ఉమ్మడి జిల్లా నుంచి దూరప్రాంతాలకు నిలిచిపోతున్న సేవలు
- పది రోజుల క్రితం మెట్‌పల్లి టూ కనిగిరి-పాము రు రద్దు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు




మంథని, జనవరి 20 : దూరప్రాంతాలు, ఇతర రాష్ట్రాలకు ఉమ్మడి జిల్లా నుంచే వెళ్లే ఆర్టీసీ బస్సులు రద్దవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు బస్సు ఫ్రీ జర్నీ చేసిన తర్వాత.. డైరెక్ట్ సర్వీసులు ఒక్కొక్కటిగా నిలిచిపోతున్నాయి. పదిహేను ఏండ్లుగా మెట్‌పల్లి నుంచి గుంటూరు జిల్లాలోని కనిగిరి– పాము రు వరకు నడిచిన మెట్‌పల్లి డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్‌ను పది రోజుల క్రితమే రద్దు చేయగా, ఇటీవల పెద్దపల్లి జిల్లాలోని మంథని నుంచి చంద్రాపూర్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసులను నిలిపివేశారు. దీంతో ఈ రూట్‌లో వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాలకు చెందిన అనేక మంది ఉపాధి కోసం చంద్రాపూర్, బాహుపేట, వని, బల్లార్ష వంటి ప్రాంతాలకు వలస వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. ఈ క్రమంలో మంథని నుంచి చంద్రాపూర్‌కు పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో ఈ ప్రయాణికులను దృష్టిలో పెట్టుకున్న ఆర్టీసీ అధికారులు ప్రతి రోజూ ఉదయం 6:30 గంటలకు, తిరిగి మధ్యాహ్నం 1:30 గంటలకు రెండు సర్వీసులను నడిపించారు. కాగా, మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కావడం.. మహిళలు ఎక్కువ సంఖ్యలో ఆర్టీసీ సేవలను వినియోగిస్తున్న నేపథ్యంలో బస్సులు సరిపోక ఆర్టీసీ సంస్థ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చంద్రాపూర్‌కు నడుపుతున్న రెండు బస్సు సర్వీసులను నిలిపివేశారు. ప్రస్తుతం ఆ రెండు బస్సు సర్వీసులను మంథని–సికింద్రాబాద్‌కు నడిపిస్తున్నారు. కాగా, మంథని నుంచి నేరుగా చంద్రాపూర్‌కు బస్సు లేక మంథని నుంచి మంచిర్యాలకు, అక్కడి నుంచి ఆసిఫాబాద్‌కు, అక్కడి నుంచి చంద్రాపూర్‌కు వెళ్తున్నారు. ఇలా రెండు మూడు చోట్లలో చిన్న పిల్లలు, లగేజీతో బస్సులు ఎక్కి దిగుతూ ఇబ్బందికర ప్రయాణం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి చంద్రాపూర్‌కు బస్సు సర్వీసును తిరిగి పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. అదే విధంగా మంథని డిపో నుంచి భద్రాచలం వెళ్లే రెండు బస్సు సర్వీసులను సైతం నిలిపి వేసి వాటిని కూడా మంథని–సికింద్రాబాద్‌కు నడిపిస్తున్నారు. ఈ విషయమై డీఎం రాజశేఖర్‌ను సంప్రదించగా, ఆర్టీసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంథని–చంద్రాపూర్‌కు వెళ్లే రెండు బస్సు సర్వీసులను, భద్రాచలానికి వెళ్లే రెండు బస్సు సర్వీసులను నిలిపివేసి, సికింద్రాబాద్‌కు నడిపిస్తున్నామని చెప్పారు.

# కదులుతున్న నకిలీ పాస్‌పోర్టుల డొంక

- సంచలనం సృష్టిస్తున్న దందా
- కౌంటర్ ఇంటెలిజెన్స్, సీఐడీ సంయుక్తంగా దర్యాప్తు
- కోరుట్ల, హైదరాబాద్‌తోపాటు మరో రెండు పట్టణాల్లో 108 నకిలీ పాస్‌పోర్టులు స్వాధీనం
- అన్నికోణాల్లోనూ లోతుగా విచారణ
- ఇద్దరు పోలీస్ అధికారుల ప్రమేయం ఉన్నట్టు సమాచారం
- అదుపులో జగిత్యాలకు చెందిన ఓ అధికారి?
- మరికొందరి పాత్రపైనా అనుమానాలు
- రెవెన్యూ, విద్యాశాఖ సిబ్బందిపై ఆరా
- తాజాగా 12 మంది సభ్యుల ముఠా అరెస్ట్



**కోరుట్ల కేంద్రంగా నకిలీ పాస్‌పోర్టుల రాకెట్ సంచలనం సృష్టిస్తున్నది. కౌంటర్ ఇంటెలిజెన్స్, సీఐడీ అధికారులు సంయుక్తంగా చేసిన దాడులతో డొంకంతా కదులుతున్నది. శుక్రవారం కోరుట్ల, హైదరాబాద్, మరో రెండు పట్టణాల్లోని అనుమానితుల ఇండ్లల్లో సోదాలు చేసి, భారీగా నకిలీ పాస్‌పోర్టులు, తయారీకి ఉపయోగించే నకిలీ ధ్రువీకరణ పత్రాలు, హార్డ్ డిస్కులు, పెన్‌డ్రైవ్‌లు స్వాధీనం చేసుకోవడంతోపాటు నలుగురిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. అయితే, ఈ వ్యవహారంలో అన్నికోణాల్లోనూ విచారిస్తూ.. పోలీస్ శాఖ పాత్రపైనా దర్యాప్తు చేస్తున్నట్టు తెలుస్తున్నది. తయారీదారులకు అన్ని రకాలుగా సహకరిస్తున్నట్టు గుర్తించి జగిత్యాలకు చెందిన ఓ పోలీస్ అధికారితోపాటు హైదరాబాద్‌కు చెందిన మరో పోలీస్ అధికారిని సైతం అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. కాగా, శనివారం 12 మంది సభ్యుల ముఠాను సీఐడీ అధికారులు అరెస్ట్ చూపడం సంచలనం సృష్టించింది.**

జగిత్యాల, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : కొద్ది రోజుల క్రితం శ్రీలంకలో ఓ ఇద్దరు వ్యక్తులు నకిలీ పాస్ట్ పోర్టులతో పట్టుబడ్డారు. ఆ సమయంలో పాస్‌పోర్టులను పరిశీలించిన అధికారులు, అవి నకిలీవని, జగిత్యాల జిల్లా కోరుట్ల ప్రాంతంలో తయారైనట్టు గుర్తించారు. ఆ మేరకు ఉన్నతాధికారులతోపాటు భారత రాయబార సంస్థలకు సమాచారం అందించారు. అలాగే, బంగ్లాదేశ్‌కు చెందిన వారు సైతం నకిలీ పాస్‌పోర్టులపై పట్టుబడ్డారు. అవి కూడా కోరుట్ల ప్రాంతం చిరునామాలతోనే ఉండడంతో మన రాష్ట్ర కౌంటర్ ఇంటెలిజెన్స్, ఆర్థిక నేర పరిశోధన విభాగం (సీఐడీ) అధికారులు రంగంలోకి దిగారు. కోరుట్ల ప్రాంతంలో నకిలీ పాస్‌పోర్టులు తయారు చేస్తున్నారనే అనుమానంతో శుక్రవారం సంయుక్తంగా దాడులు చేశారు. నలుగురి ఇళ్లల్లో సోదాలు చేసి, పెద్ద మొత్తంలో నకిలీ పాస్‌పోర్టులు, తయారీకి అవసరమయ్యే ఆధార్, ఓటరు, రేషన్‌కార్డులు, పదో తరగతి మెమోలు, వయసు ధ్రువీకరణ పత్రాలు (నకిలీవి), కంప్యూటర్ హార్డ్ డిస్కులు, పెన్‌డ్రైవ్‌లు స్వాధీనం చేసుకోవడంతోపాటు నలుగురిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. అదే రోజు రాష్ట్రంలోని మరో రెండు పట్టణాలు, హైదరాబాద్‌లోని కొన్ని ఏరియాల పరిధిలో తనిఖీలు చేసి, మొత్తంగా 108 నకిలీ పాస్‌పోర్టులు, తయారీకి సిద్ధంగా ఉంచిన ధ్రువీకరణ పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. కాగా, ఈ వ్యవహారంలో నకిలీ పాస్‌పోర్టుల తయారీదారులతోపాటు అందుకు సహకరించిన పోలీస్ అధికారులను సైతం గుర్తించే పనిలో కౌంటర్ ఇంటెలిజెన్స్, సీఐడీ అధికారులు తలమునకలయ్యారు. పదేళ్ల నుంచి కోరుట్ల కేంద్రంగా దందా సాగుతుండడం, ఇప్పటికే కేసులు సైతం నమోదైన నేపథ్యంలో లోతుగా అన్వేషిస్తున్నారు. గతంలో ఇక్కడ విధులు నిర్వర్తించి, తర్వాత ఉద్యోగోన్నతిపై ప్రస్తుతం జగిత్యాలలో పనిచేస్తున్న ఓపోలీస్ అధికారి, ఈ నకిలీ పాస్‌పోర్టుల తయారీదారులకు అన్ని రకాలుగా సహకరించినట్టు నిర్ధారించుకొని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. అలాగే, హైదరాబాద్‌లోని ఒక ఏరియాలో పనిచేసే పోలీస్ అధికారి సైతం పాస్‌పోర్టుల తయారీకి సహకరించినట్టు గుర్తించి, అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. కాగా, శనివారం 12 మంది సభ్యుల ముఠాను సీఐడీ అధికారులు అరెస్ట్ చూపారు. వందల మంది విదేశీయులకు పాస్‌పోర్టులు అందించారని చెప్పారు.

### రెవెన్యూ, విద్యాశాఖ పాత్రపై ఆరా

బంగ్లాదేశ్, శ్రీలంక దేశాలవాసులకు పాస్‌పోర్టులు తయారు చేసి ఇవ్వడాన్ని తీవ్రంగా పరిగణించిన కౌంటర్ ఇంటెలిజెన్స్, సీఐడీ అధికారులు, లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. విదేశీయులకు పాస్‌పోర్టు తీసేందుకు ఇక్కడి చిరునామాలు సృష్టించడంతోపాటు రెవెన్యూ, ఎడ్యుకేషనల్ సర్టిఫికెట్లను సైతం తయారు చేసినట్టు గుర్తించారు. అలాగే స్థానికుల ఆధార్, ఓటరు కార్డులను విదేశీయులు, స్థానికేతరుల పేర్లతో డూప్లికేట్ చేసినట్టు నిర్ధారించుకున్నారు. ఈ క్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించిన కొన్ని ముద్రలు, పత్రాలు, విద్యా శాఖ ధ్రువీకరణ పత్రాలు, నకిలీ మెమోలు లభ్యం కావడంతో రెవెన్యూ, విద్యాశాఖల అధికారులు, సిబ్బంది సహకారం ఉన్నదా..? అనే కోణంలో ఆరా తీస్తున్నట్టు సమాచారం. కాగా, నకిలీ పాస్‌పోర్టుల తయారీదారుల్లో ఒకరు విద్యాశాఖలో ఉద్యోగి కావడంతో లోతుగా విచారణ జరుపుతున్నట్టు తెలిసింది.

### అన్ని కోణాల్లోనూ దర్యాప్తు

సీఐడీ, కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నారు. మనుషులను దేశాలు దాటించేందుకు నకిలీ పాస్‌పోర్టులు తయారు చేసినప్పటికీ, దాని వెనుకాల ఉన్న కారణాలను లోతుగా అన్వేషిస్తున్నారు. విదేశీయులకు ఇక్కడ ఎలా పాస్‌పోర్టులు సృష్టించారు? ఎందుకు సృష్టించారు? వారికి ఉపాధి కల్పించే లక్ష్యమా..? లేకపోతే మరేదైనా కారణం ఉన్నదా..? అని విచారణ జరుపుతున్నట్టు సమాచారం. కోరుట్ల, హైదరాబాద్ లాంటి అతి సున్నితమైన ప్రాంతాల్లో నకిలీ పాస్‌పోర్టులు బయటపడడంతో తీవ్రవాద సంస్థలకు సైతం వీరు సహకరించారా..? అన్న కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్టు తెలుస్తున్నది. దాదాపు 20 ఏండ్లుగా నిషేధిత తీవ్రవాద సంస్థలకు సంబంధించిన ఆనవాళ్లు కోరుట్ల, జగిత్యాల, నిజామాబాద్, కరీంనగర్ ప్రాంతాల్లో బయటపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నకిలీ పాస్‌పోర్టుల తయారీపై పూర్తి స్థాయి పరిశీలన చేస్తున్నట్టు సమాచారం.

### 'డీ గ్యాంగ్' స్మగ్లింగ్‌పైనా అనుమానాలు

నకిలీ పాస్‌పోర్టులు తయారు చేయించి, డీ గ్యాంగ్ వాళ్లకు సపోర్టుగా స్మగ్లింగ్ ఏమైనా జరుగుతున్నదా..? అన్న కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్టు తెలుస్తున్నది. దావూద్ ఇబ్రహీం గ్యాంగ్‌కు సంబంధించి బంగారం, ఇతర మాదకద్రవ్యాల స్మగ్లింగ్ కొన్నేండ్లుగా జరుగుతున్నదనే అనుమానాలు ఉన్న విషయం తెలిసిందే. పలు సందర్భాల్లో బంగారం, మాదకద్రవ్యాలు సప్లై చేస్తూ కొందరు పట్టుబడిన దాఖలాలు ఉన్నాయి. కాగా, కోరుట్ల కేంద్రంగా నకిలీ పాస్‌పోర్టుల తయారీ బయటకు వచ్చిన నేపథ్యంలో దావూద్ గ్యాంగ్‌కు సంబంధించిన వ్యక్తులు ఇతర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ నకిలీ పాస్‌పోర్టులు సృష్టించుకొని స్మగ్లింగ్‌కు పాల్పడి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న స్వీప్ నోడల్ అధికారి, అధికారులు

## స్వీప్‌లో మెరిసిన జగిత్యాల జిల్లా

రాష్ట్రస్థాయిలో రెండు బహుమతులు

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 20 : గత అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటు నమోదుపై అవగాహనకు ఎలక్షన్ కమిషన్ నిర్వహించిన స్వీప్ (సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం)లో భాగంగా జగిత్యాల జిల్లా మెరిసింది. రాష్ట్రస్థాయిలో రెండు బహుమతులు సాధించినట్లు కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన గడ్డం బోగె అశోక్ దర్శకత్వంలో జానపద కళాకారుడు గడ్డం రమేశ్ బృందం పాడిన పాట, కొడిమ్యాల కస్తూర్బా విద్యార్థినులు ప్రదర్శించిన నాటికలకు వేర్వేరుగా మొదటి బహుమతులు దక్కాయని వెల్లడించారు. బహుమతులు పొందిన కళాకారులు, విద్యార్థినులను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. కాగా, స్వీప్ జిల్లా నోడల్ ఆఫీసర్ కే లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు డీఆర్డీవో పీ నరేశ్, ఏపీడీ సుధీర్, హౌసింగ్ డీఈ రాజేశ్వర్, డీపీఆర్ఓ భీమ్‌కుమార్ కలెక్టర్‌ను కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



## కూ... చుక్ చుక్

కరీంనగర్ రైల్వే జంక్షన్ కళకళలాడుతున్నది. రోజురోజుకూ రద్దీ పెరుగుతున్నది. ఒకప్పుడు ఇక్కడి నుంచి ఒకటో రెండో రైళ్లు మాత్రమే వెళ్లేవి. కానీ, ఇటీవలి కాలంలో వాటి సంఖ్య దాదాపు పదిహేనుకుపైనే పెరిగింది. నిత్యం ప్యాసింజర్, గూడ్స్ రైళ్ల రాకపోకలతో సందడి కనిపిస్తున్నది. శనివారం కరీంనగర్‌లో రైల్వేస్టేషన్ సమీపంలో ఇండ్ల మధ్య నుంచి రైలు వస్తుండగా, ఆ దృశ్యాన్ని 'నమస్తే' క్లిక్‌మనిపించింది. - కరీంనగర్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్

## అనగనగా ఓ తండా..

- వైవిధ్యం.. లంబాడి తండా జీవనం
- నర్సింగాపూర్‌కు 3 కిలోమీటర్ల దూరంలోని గుట్టల్లో ఆవాసం
- వందేండ్ల కిందట ఆదిలాబాద్ జిల్లా నుంచి వలస
- ప్రస్తుతం 12 కుటుంబాలు నివాసం
- గొర్రెల పెంపకం, వ్యవసాయమే ఆధారం



నర్సింగాపూర్ శివారులోని గుట్టల మధ్య లంబాడి తండాలోని ఇండ్లు

**ఎక్కడో గుట్టల్లో నివాసాలు. ఉన్నవి కేవలం 12 కుటుంబాలు. నివసించేది 32 మంది. గొర్రెలు, మేకల పెంపకం, వ్యవసాయమే ఆధారంగా వైవిధ్యమైన జీవనాన్ని కొనసాగిస్తున్న ఓ తండా కథ ఇది..**

ధర్మారం జనవరి 20 : ఆదిలాబాద్ జిల్లాకు చెందిన భూక్యా సంగ్యా నాయక్, భూక్యా రంజిత్‌నాయక్ అనే ఇద్దరు అన్నదమ్ములు సుమారు వందేండ్ల క్రితం మేకలను మేపుకొంటూ వచ్చి ధర్మారం మండలం నర్సింగాపూర్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుట్టల్లో స్థిరపడ్డారు. మొదట గుడిసెలు వేసుకొని ఉండేవారు. మొదట గొర్రెల పెంపకమే వీరి జీవనాధారం. క్రమంగా 12 కుటుంబాలు ఏర్పడగా 32 మంది నివసిస్తున్నారు. కాగా, ప్రస్తుతం వ్యవసాయంవైపు మళ్లారు. సంగ్యానాయక్‌కు ఐదుగురు బిడ్డలు జన్మించగా వారికి పెండ్లిళ్లు చేశాడు. అతడి తమ్ముడు రంజిత్ నాయక్‌కు నలుగురు కొడుకులు జగ్యా నాయక్, పర్శా నాయక్, భీమ్లా నాయక్, దేల్యా నాయక్ ఉన్నారు. తదనంతర కాలంలో సంగ్యానాయక్, రంజిత్ నాయక్ భార్యభర్తలు మరణించారు. కాగా, రంజిత్ నాయక్ పెద్ద కొడుకు జగ్యా నాయక్‌కు ఒక కొడుకు, రెండో కొడుకు పర్శానాయక్‌కు ముగ్గురు కొడుకులు, 3వ కొడుకు భీమ్లా నాయక్‌కు నలుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు, చిన్న కొడుకు దేల్యా నాయక్‌కు ఒక కొడుకు, ముగ్గురు కూతుళ్లు. రంజిత్ నాయక్ నలుగురు కొడుకుల్లో ముగ్గురు వృద్ధాప్యంతో మరణించగా ఇప్పుడు మూడో కొడుకైన భీమ్లా నాయక్ (75) జీవించి ఉన్నాడు. ప్రస్తుతం ఈ తండాలో 10 మంది పురుషులు, 22 మంది మహిళలు ఉన్నారు. చుట్టూ గుట్టలు, చిత్తడి ప్రదేశంలో రేకుల షెడ్లల్లో ఉంటున్నారు. కాగా, నర్సింగాపూర్ సమీపంలోని సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద ఉన్న భోగందాని గుట్ట బోరు ప్రాంతంలో ప్రభుత్వ భూమిలో ఇండ్లు నిర్మించుకోవాలని భావిస్తున్నారు. నాలుగు నెలల క్రితం ఈ భూమిని చదును చేయించారు. 12 ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వ భూమి కేటాయించాలని కోరుతున్నారు.

### ఊరి దగ్గర ఇండ్లు కట్టియ్యాలె..



మా పూర్వీకులు ఆదిలాబాద్ నుంచి గొర్రెలు మేపుకొంటూ వచ్చి ఇక్కడి గుట్టమధ్య స్థిరపడ్డారు. గొర్రెలు పెంచుకుంటూ, ఎవుసం చేసుకుంటూ ఇక్కడే ఉంటున్నం. మా నలుగురు అన్నదమ్ములకు పెండ్లిండ్లు అయ్యాయి. సంతానం పెరిగింది. ఇన్నేండ్లు కష్టానష్టాలను ఓర్చుకుంటూ ఇక్కడే ఉంటున్నం. అయితే మా పిల్లలు బడికి వెళ్లడం, రేషన్ సరుకులు తెచ్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నం. ఇప్పుడు మా ఊరు దగ్గరలో ఇండ్లు కట్టుకోవాలని అనుకుంటున్న. గవర్నమెంట్ మాకు ప్రభుత్వ భూమి ఇప్పించి ఇండ్లు కట్టియ్యాలి.

- భూక్యా భీమ్లా నాయక్, లంబాడి తండా వాసి (నర్సింగాపూర్)



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి

## దళితబంధును కొనసాగించాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

గోదావరిఖని, జనవరి 20 : కేసీఆర్ సర్కారు తెచ్చిన దళితబంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గోదావరిఖనిలో శనివారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితులపై చిన్నచూపు చూస్తున్నదని మండిపడ్డారు. దళితబంధు దళితుల జీవితాల్లో వెలుగులు నింపిందని, అలాంటి పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరారు. సమావేశానికి ముందు ఎమ్మార్పీస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా యాసర్ల రాజ్‌కుమార్(తిమోతి)ను శ్రీనివాస్ ఎంపిక చేశారు. సమావేశంలో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు కొట్టెపల్లి దుర్గాప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, ఎంఎస్ఎఫ్ నియోకవర్గ ఇన్‌చార్జి ఈర్ల ప్రేమ్‌కుమార్, నాయకులు మేడ ప్రవీణ్, మాచర్ల శ్రీనివాస్, కుమ్మరి నవీన్, దయాకర్, సుందిల్ల రేణుక ఉన్నారు.

## పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమీక్ష

కోర్టుచౌరస్తా, జనవరి 30: తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాల మేరకు శనివారం ఉమ్మడి జిల్లాలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వింజమూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాసిక్యూటర్ల సమస్యలపై చర్చించారు. సందేహాలను నివృత్తి చేశారు. ఎక్కువ కేసుల్లో శిక్షల విధింపునకు కారణమైన పీపీలను అభినందించారు. క్రిమినల్ కేసులు విచారణకు వచ్చే ముందు పీపీలు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని సూచించారు.అనంతరం అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల లక్ష్మీప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మురళీధర్ కేసుల విచారణ సమయంలో సాక్షుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్, స్పెషల్ పీపీ బాల త్రిపురా సుందరి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు తుముకి పవన్‌కుమార్, ఆరెల్లి రాములు, జూలూరి శ్రీరాములు, గౌరు రాజిరెడ్డి, గడ్డం లక్ష్మణ్, కాసారం మల్లేశం, పెంట శ్రీనివాస్ , శరత్ పాల్గొన్నారు.



సమీక్షా సమావేశం అనంతరం పబ్లిక్ ప్రాసిక్యూటర్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల

## బీజేపీ, బీఆర్ఎస్ మధ్యే పోటీ

- కరీంనగర్ ఎంపీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో తెలియదు
- కొత్త ప్రభుత్వాన్ని కూల్చాల్సిన అవసరం మాకు లేదు
- ప్రజాతీర్పును శిరసావహిస్తాం
- బల్దియాలో అవిశ్వాసం ఉండదు
- ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 20 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్‌లో బీజేపీ, బీఆర్ఎస్ మధ్యే పోటీ ఉంటుందని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరీంనగర్ నియోజకవర్గంలో పొన్నం ప్రభాకర్ తర్వాత కాంగ్రెస్‌కు ఎక్కడా ఓటు బ్యాంకు రాలేదని, ఇక్కడ ఆ పార్టీ రెండుసార్లు గెలిచిన దాఖలాలు లేవన్నారు. గతంలో ఎమ్మెస్సార్ గెలిచినా, అది కూడా బీఆర్ఎస్ మద్దతుతోనేనని చెప్పారు. ఇప్పటివరకు కరీంనగర్ ఎంపీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో కూడా తెలియదని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. 2014లో బీజేపీ మోదీ ప్రభావం ఉన్నా కరీంనగర్ ఎంపీగా వినోద్ కుమార్ గెలిచారని గుర్తు చేశారు. ప్రజల అభీష్టం మేరకు ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చాల్సిన అవసరం తమకు లేదన్నారు. ప్రజా తీర్పును శిరసావహిస్తామని, గౌరవిస్తామని చెప్పారు. ప్రజలు తమకు ప్రతిపక్షం పాత్ర ఇచ్చారని, సమర్థవంతంగా పనిచేస్తామని వివరించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ కాం గ్రెస్ నెరవేర్చేదాకా పోరాడుతామన్నారు. 1999లో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత, ఆరు నెలల్లోనే వచ్చిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్పటి టీడీపీ ఓడిపోయిందని గుర్తు చేశారు. అప్పుడు చంద్రబా బు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించడం వల్లే ప్రజలు ఇతర పార్టీలకు అవకాశం ఇచ్చారన్నారు. ఇప్పుడు కూడా ప్రభుత్వ పనితీరును అనుసరించే తీర్పు ఇస్తారని తెలిపారు. కరీంనగర్ నియోజకవర్గ పరిధిలో ఎక్కడా అవిశ్వాసం వచ్చే అవకాశమే లేదని, ఒకవేళ కార్పొరేషన్‌లో పెట్టాలంటే 45 మంది కార్పొరేటర్ల మద్దతు అవసరమన్నారు. అది జరిగే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 45 రోజులవుతున్నదని, కరీంనగర్‌లో ఎక్కడికక్కడ అభివృద్ధి నిలిచిపోయిందని మండిపడ్డారు. కరీంనగర్‌లోని వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల విషయం లో రాజకీయాలు అవసరం లేదన్నారు. ప్రభుత్వం నుంచి చేస్తామంటే తాము స్వాగతిస్తామని తెలిపారు. వీటితో పాటు ఇతర ఆలయాల్లోనూ అభివృద్ధి పనులు, కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తాము తీసుకువచ్చిన మానేరు రివర్ ఫ్రంట్, రేకుర్తి నరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. భూకబ్జాల విషయంలో ఎవరైనా తప్పు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. తప్పు చేస్తే తప్పకుండా చట్టపరంగా శిక్ష అనుభవిస్తారని స్పష్టం చేశారు. ఆదివారం కరీంనగర్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేసుకుంటున్నామని తెలిపారు. ఈ నెల 24న పార్లమెంట్ స్థాయి సోషల్ మీడి యా సమావేశం ఏర్పాటు చేసుకొని పార్టీ కా ర్యకర్తల్లో జోష్ తీసుకువస్తామని, ఈ మీటింగ్‌కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని పేర్కొన్నారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణాన్ని స్వాగతిస్తామన్నారు. దేవుడి కార్యక్రమాన్ని ఎక్కడా రాజకీయ కోణంలో చూడాల్సిన అవసరం లేదన్నారు.